క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి

కోవూరు: ప్రజలకు గ్రామ సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని, తద్వారా ప్రజల మన్ననలు పొందేందుకు వీలు ఉంటుందని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి అన్నారు. మండలంలోని గ్రామ సచివాలయం-1ను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేయాలని తెలిపారు. సచివాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కంది సాగు అనుకూలం

పొదలకూరు: ప్రస్తుత వాతావరణం కందిపంట సాగుకు అనుకూలంగా ఉంటుందని ఏఓ ఎ.వాసు రైతులకు సూచించారు. మండలంలోని బిరదవోలు, కల్యాణపురం గ్రామాల్లో జరుగుతున్న కందిపంట సాగును ఆర్బీకే సిబ్బందితో కలిసి ఏఓ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో కంది సాగు చేపట్టవచ్చన్నారు. మండలంలో మెట్టపొలాలు అధికంగా ఉన్నందున కందితో పాటు రబీ సీజన్లో మినుము, పచ్చిశనగ, పెసర పంటలు సాగుచేస్తుంటారని, అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కంది అనుకూలంగా ఉంటుందని తెలిపారు. కందిని ఏకపంట లేదా అంతర్గత పంటగా సాగు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. మినుము, పెసర, పచ్చిశనగ పంటల్లో అంతర్‌పంటగా కంది సాగుచేస్తే రైతు లాభాల బాటలో పయనించవచ్చని సలహా ఇచ్చారు.

విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకానికి సన్నాహాలు

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో పునర్నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు విగ్రహాల ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం భారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టారు. వందల ఏళ్ల నాటి శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పడగొట్టి 2017 నవంబర్ 17న విష్ణాలయం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఒకే ప్రాంగణంలోనే రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు భారీ విష్ణాలయం నిర్మాణ పనులు చేపట్టారు. ఏడు అంతస్తుల ఎత్తున గాలిగోపురం నిర్మాణం పూర్తి చేశారు. సుమారు రూ.13.5 కోట్ల వ్యయంతో పూర్తిగా గ్రానైట్ రాళ్లతో నిర్మించిన ఆలయంలో సుమారు 22 విగ్రహాలను ప్రతిష్ఠ చేసేందుకు రంగం సిద్ధం చేశారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఈఓ జనార్దనరెడ్డి మంత్రికి పట్టుశాలువ కప్పి ఆహ్వానించారు. ఉప సర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలతో మానసికోల్లాసం

మనుబోలు : వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని మనుబోలు లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ అన్నారు. మనుబోలు గ్రంథాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌తో పాటు పలు రకాల పోటీలు నిర్వహించారు. పేపర్ క్రాఫ్ట్స్‌పై అవగాహన కల్పించి విద్యార్థులతో పేపర్ బొమ్మలు చేయించారు. యోగా ట్రైనర్ కోటేశ్వరరెడ్డి యోగా క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాలతో విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికి తీసేలా వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రమణీయం.. తెప్పోత్సవం

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చివరి రోజు మంగళవారం రాత్రి తెప్పోత్సవం రమణీయంగా సాగింది. తొలుత చాముండేశ్వరీదేవిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ వెనుక వైపు ఉన్న కోనేరులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై అమ్మవారిని కొలువుదీర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, బాణసంచా, భక్తుల జయజయ నామస్మరణల నడుమ స్వామి, అమ్మవారు కొలనులో విహరించారు. ఉభయకర్తలుగా నావూరు మురళీమనోజ్‌కుమార్, అరుణ వ్యవహరించారు. ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్‌కుమార్ శర్మ, మాచవోలు రామకృష్ణ, ముప్పిరాల కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో తొలుత అమ్మవారికి పూలంగి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా హైదరాబాద్‌కు చెందిన పాలగిరి రమేష్-చాముండేశ్వరి, పాలగిరి సందీప్- లాస్య దంపతులు వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేకువజామున అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస ప్రార్థనలతో దీక్షబూనిన భక్తులు నిప్పుల గుండాన్ని తొక్కి భక్తిని చాటుకున్నారు. అనంతరం ధ్వజా అవరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ప్రణాళికబద్ధంగా పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణ



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రజా మరుగుదొడ్లను ప్రణాళికబద్ధంగా నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. సంతపేట, ములుమూడి బస్టాండ్, ఆర్‌ఆర్ స్ట్రీట్, కుసుమ దళితవాడ, గాంధీనగర్, ఆత్మకూరు బస్టాండ్, కొత్త హాల్ వెనుక ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న ప్రజా మరుగుదొడ్లను ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రూపొందించిన టాయ్‌లెట్ 2.0 కార్యక్రమంలో భాగంగా నూతన మరుగుదొడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మరుగుదొడ్లలో దివ్యాంగులకు వసతులు, చిన్నపిల్లల కోసం సౌకర్యాలతో పాటు మహిళలకు అవసరమైన శానిటరీ నాప్కిన్లను సైతం అందుబాటులో ఉంచాలని చెప్పారు. కొత్తహాల్ వెనుక వైపు ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సులభ్ కాంప్లెక్స్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి మెరుగైన పారిశుధ్యానికి సహకరించాలని కమిషనర్ కోరారు. ములుమూడి బస్టాండ్, చిన్నబజార్, పెద్దబజార్, రాయాజీవీధి, సండే మార్కెట్, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పండ్ల ప్యాకింగ్ పేపర్లను కాలువల్లో వేయరాదని, దుకాణం బయట తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్ బిన్లను ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం సండే మార్కెట్ సమీపంలో ఉన్న యాచకులతో మాట్లాడారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందించేలా కృషి చేయాలని అధికారులకు చెప్పారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, టీపీఆర్వో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ డ్రోన్లతో రీ సర్వే

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో రీ సర్వే ప్రక్రియలో అత్యాధునిక డిజిటల్ డ్రోన్ సేవలను వినియోగించుకొని త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పట్టణ ప్రణాళిక విభాగాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలోని 154 చదరపు కిలోమీటర్ల మేర రీ సర్వేను డ్రోన్లతో బుధవారం నుంచి చేపట్టనున్నామని చెప్పారు.

అపరాధ రుసుము లేకుండా పన్ను చెల్లించే అవకాశం

2023 – 24 మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈ నెల 30లోపు చెల్లించొచ్చని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వానికి ఏపీ జేఏసీ కృతజ్ఞతలు



మాట్లాడుతున్న పెంచలరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమాన్ని గుర్తించి ప్రభుత్వం చర్చలు జరపడంపై శాఖ జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి కృతజ్ఞతలను తెలియజేశారు. ఈ మేరకు నగరంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల కోసం చర్చలు జరపడంపై ఆనందం వ్యక్తం చేశారు. జనరల్ సెక్రటరీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

నెల్లూరు (వేదాయపాళెం): పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన రజక విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని సంత్‌గాడ్గే బాబా అభ్యుదయ వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యలమందల రమణయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ వివరాలను ముందుగా నమోదు చేసుకోవాలని కోరారు. పురమందిరంలో ఈ నెల 11వ తేదీ ఉదయం పది గంటలకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 94401 97646 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాహుల్ గాంధీని బలపర్చాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ప్రజలు బలపర్చాలని పార్టీ నేత డాక్టర్ పల్లంరెడ్డి యశోధర పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని పొట్టేపాళెం కొత్త దళితవాడ, తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. అనంతరం ఇంటింటికీ స్టిక్కర్లను అతికించారు. రమాదేవి, విజయ్‌కుమార్, అమ్మణమ్మ, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు



నెల్లూరు(అర్బన్): నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలను డెమో అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో అధికారి కనకరత్నం, తదితరులు మంగళవారం చేపట్టారు. శ్రీనివాస స్కాన్ సెంటర్, సత్య డయాగ్నొస్టిక్స్, వేద హాస్పిటల్, సెయింట్ జోసఫ్స్ ఆస్పత్రిలోని స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. పీసీ అండ్ పీఎన్డీటీ చట్టం ప్రకారం రికార్డులను నిర్వహిస్తున్నారాననే అంశాన్ని ఆరాతీశారు. అనంతరం వారు మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్కానింగ్ వివరాలను ఫారమ్ – ఎఫ్‌లో పొందుపర్చి వాటిని ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ నివేదికలను డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ప్రతి నెలా ఐదులోపు పంపాలని ఆదేశించారు.

కొనసాగుతున్న వేసవి క్రీడా శిబిరాలు



నెల్లూరు రూరల్: మాదరాజుగూడూరులోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వేసవి క్రీడా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. హాకీపై పీఈటీ సురేఖ శిక్షణనిచ్చారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు.

ఉపాధి అధికారికి వీడ్కోలు



సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(మినీబైపాస్): వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయిన జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్‌కు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, డీటీసీ చందర్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ రమేష్‌నాథ్, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ తిరుపతయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ హ్యాండ్లూమ్స్ ఆనంద్‌కుమార్, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

నెల్లూరు సిటీ: ప్రయాణికులు తెలియజేసిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని నెల్లూరు ఆర్టీసీ రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ పేర్కొన్నారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రయాణికులు తెలియజేశారు. నెల్లూరు నుంచి బెంగళూరు వెళ్లే బస్సులకు కృష్ణరాజపురంలో స్టాపింగ్‌ను కల్పించాలని ఓ ప్రయాణికుడు కోరారు. కాగా ఆ ప్రాంతంలో ఎలాంటి బస్సు స్టాపింగ్ లేదని అక్కడి పోలీస్ శాఖ నుంచి ఉత్తర్వులు ఉన్నాయని డీఎం చెప్పారు.

బిందు సేద్యంతో సత్ఫలితాలు



మాట్లాడుతున్న రమేష్

నెల్లూరు(పొగతోట): బిందు సేద్యంతో పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటి ఖర్చుతో అధిక దిగుబడులను పొందవచ్చని ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్ పేర్కొన్నారు. బిందు, తుంపర్ల సేద్యానికి సంబంధించిన పరికరాల ఏర్పాటుపై ఫిటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్డీఏ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిందు, తుంపర్ల సేద్యంపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. పరికరాలను ఏర్పాటు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతి మొక్కకూ నీరందేలా పైపులను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు మాట్లాడారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 3500 హెక్టార్లలో పరికరాలను ఏర్పాటు చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారని తెలిపారు. పరికరాలను సకాలంలో ఏర్పాటు చేసి రైతులకు ఉపయోగంలోకి తీసుకొచ్చేలా చూస్తామని ప్రకటించారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి



చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు



సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన నేతలు

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో 2014కు ముందు నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించేలా చూడాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సునీల్‌శర్మ కోరారు. ఈ మేరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రాన్ని నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో మంగళవారం అందజేశారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, నేతలు కోటేశ్వరరావు, రామాంజనేయులు, సందానీబాషా, కిరణ్‌రెడ్డి, వినీత్, జకీర్, వెంకటేశ్వర్లు, సురేష్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

• ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ గవర్నమెంట్ కాలేజెస్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేష్, శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి విజయవాడలో వినతిపత్రాన్ని అందజేశారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'



నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ నెల 11 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్పర్సన్ దొంతు శారద పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సభ్యుడు మహేష్, సతీష్‌కుమార్, ప్రసన్నకుమార్, సుబ్బారావు, గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, రవీంద్రన్, గిరిజ, పూర్ణచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార జాతాకు ఘన స్వాగతం



నెల్లూరు (వేదాయపాళెం): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హిందూపురంలో ప్రారంభమైన ప్రచార జాతా నగరంలోకి మంగళవారం ప్రవేశించింది. అయ్యప్పగుడి సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయడంతో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కార్మిక సంఘ నేతలు నాగేంద్రబాబు, నాగరాజు, గోపీ, లక్ష్మీనారాయణ, యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనర్సయ్య, బత్తల కిష్టయ్య, సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, కిన్నెర కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు సుజాతమ్మ, దేశమూర్తి, వజ్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై గుర్తుతెలియని కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లోని సప్తగిరి లేఅవుట్‌కు చెందిన అజారుద్దీన్‌కు షబ్బానాతో 2020లో వివాహమైంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. కుటుంబకలహాల నేపథ్యంలో దంపతులు విడిపోయారు. ఆర్నెల్ల క్రితం ఎంజీబీ మాల్లో అజారుద్దీన్ ఉండగా అతని బావమరిది షారూక్ దాడి చేశారు. సదరు విషయమై బాధితుడు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టి పెద్దల సమక్షంలో రాజీచేసుకున్నారు. అయినా షారూక్ చంపుతామని బెదిరించసాగారు. ఈ నేపథ్యంలో అజారుద్దీన్ తన స్నేహితులతో కలిసి మాగుంట లేఅవుట్లో సోమవారం రాత్రి ఉండగా, మాస్కులు ధరించిన పది మంది గుర్తుతెలియని వ్యక్తులు అతనిపై దాడి చేసి గాయపర్చారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. దాడి వెనుక తన బావమరిది హస్తం ఉందని, విచారణ జరపాలంటూ దర్గామిట్ట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

10న డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఈ నెల పదిన నిర్వహించనున్నామని నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రయాణికులు వారి సలహాలు, సూచనలను తెలియజేయాలని కోరారు. 99592 25611 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యాచకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని కాగులపాడు రోడ్డు సమీపంలో ప్రైవేటు లేఅవుట్‌లో యాచకుడు మృతిచెందినట్లు మంగళవారం గుర్తించారు. స్థానికుల కథనం మేరకు.. స్థానికంగా ఉన్న కొందరు రైతులు తమ పొలాలకు నీరు పెట్టుకునేందుకు వెళ్లగా కాలువ పక్కన దుర్వాసన రావడంతో వెళ్లి చూశారు. అక్కడ సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రామారావు, ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి గ్రామంలో విచారణ చేపట్టారు.

క్రైమ్ కార్నర్

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): లోన్‌ను పూర్తిగా చెల్లించినా, రుణగ్రహీతను మోసగిస్తున్న వ్యక్తిపై చీటింగ్ కేసును దర్గామిట్ట పోలీసులు మంగళవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేటకు చెందిన నారాయణ మిలటరీ కాలనీలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో 2021లో రెండు దఫాలుగా రూ.1.5 లక్షల రుణాన్ని తీసుకున్నారు. ప్రతి నెలా ఆయన శాలరీ అకౌంట్ నుంచి రూ.5,729 ఈఎంఐ ఫైనాన్స్ కంపెనీకి జమవుతోంది. రెండు లోన్లకు సంబంధించిన మొత్తాన్ని గతేడాది పూర్తిగా చెల్లించి ఎన్‌ఓసీని ఇవ్వాలని సదరు కంపెనీ మేనేజర్ ప్రభాకర్‌ను కోరారు. మెయిల్‌కు వస్తుందని చెప్పడంతో నారాయణ వెళ్లిపోయారు. అయినా నారాయణ బ్యాంక్ అకౌంట్ నుంచి నగదు కట్ అవుతూనే ఉంది. దీంతో ఫైనాన్స్ కంపెనీలో ఆరాతీయగా చాలా మందిని ప్రభాకర్ ఇదే తరహాలో మోసం చేయడంతో ఉద్యోగం నుంచి తీసేశారని చెప్పారు. దీంతో సదరు వ్యక్తిపై చర్యలు చేపట్టాలని కోరుతూ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

ప్రేమ పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ప్రేమ పేరిట యువతిని మోసగించిన వ్యక్తి, అతని తల్లిదండ్రులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సుందరయ్య కాలనీకి చెందిన ఓ యువతి అల్‌హుదా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చదివారు. ఆ సమయంలో అదే కళాశాలలో సీనియరైన ఓజిలి మండలానికి చెందిన వహీద్ ప్రేమిస్తున్నానంటూ ఆమె వెంటబడ్డారు. తొలుత నిరాకరించినా.. ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని పదేపదే చెప్పడంతో ఆమె నమ్మారు. డిప్లొమా పూర్తయ్యాక రాజమహేంద్రవరంలో ఉద్యోగం వచ్చిందని యువతికి చెప్పి తన సొంతూరెళ్లారు. అప్పటి నుంచి ఇద్దరూ రోజూ ఫోన్లో మాట్లాడుకునేవారు. ఆమె నుంచి రూ.లక్షను తీసుకొని కొంతకాలం తర్వాత మాట్లాడటం మానేశారు. దీంతో విషయాన్ని తల్లిదండ్రులకు యువతి తెలియజేశారు. వహీద్ ఇంటికెళ్లి అతని తల్లిదండ్రులతో మాట్లాడగా, వారు వివాహానికి అంగీకరించారు. రోజులు గడుస్తున్నా వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో తిరిగి యువతి తల్లిదండ్రులు వహీద్ తల్లిదండ్రులను గత నెల 11న సంప్రదించారు. పెళ్లి చేసేది లేదంటూ యువతి తల్లిదండ్రులను వారు నానా దుర్భాషలాడారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీస్ కాలనీలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఏసీ స్టేడియం వెనుక వైపు గల పోలీస్ కాలనీలో నివాసం ఉంటున్న లక్ష్మమ్మ భర్త అనారోగ్యంతో చనిపోయారు. కొండాయపాళెం గేట్ వద్ద టిఫిన్ అంగడిని పెట్టకొని ఆమె జీవనం సాగిస్తున్నారు. ఆమె వద్ద నరసయ్య పనిచేస్తున్నారు. పని నిమిత్తం ఈ ఏడాది ఏప్రిల్ 17న కలువాయి మండలంలోని చౌటపల్లికి ఆమె వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి వెనుక తలుపులను పగలగొట్టి కుక్కర్ బాక్సులో ఉన్న మూడు సవర్ల బంగారు సరుడు, రెండు గ్రాముల కమ్మలు, రూ.ఐదు వేల నగదును అపహరించుకెళ్లారు. అదే నెల 22న ఇంటికొచ్చిన ఆమె చోరీ విషయాన్ని నిర్ధారించుకున్నారు. ఘటనపై దర్గామిట్ట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దేవరపాళెంలో చోటుచేసుకుంది. నెల్లూరు రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ఎగ్గుల పెంచలయ్య (45)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇటీవల నొప్పి ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యారు. దీంతో గడ్డి మందును సేవించారు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన నారాయణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి మంగళవారం చేరుకొని విచారణ జరిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల చోరీ

నెల్లూరు(క్రైమ్): వేర్వేరు ప్రాంతాల్లో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. కనుపర్తిపాడుకు చెందిన సురేంద్ర తన హోండా షైన్ బైక్‌ను అయ్యప్పగుడి ఫ్లయ్ఓవర్ వద్ద ఏప్రిల్ తొమ్మిదిన నిలిపి బేల్దారి పనులకెళ్లారు. అనంతరం తిరిగొచ్చేసరికి బైక్ కనిపించలేదు. దీంతో వేదాయపాళెం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

• బుజబుజనెల్లూరుకు చెందిన కిషోర్ తన హోండా బైక్‌ను అయ్యప్పగుడి వద్ద మే ఏడున నిలిపి దర్శనానికి వెళ్లారు. అనంతరం వచ్చేసరికి వాహనం కనిపించలేదు. దీంతో వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన పాలడుగు భాస్కరరావు, తండ్రి. వెంకటేశ్వర్లు, బి.వి.నగర్, నెల్లూరు. గారి అనుమతి మేరకు యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని శ్రీ గాదం శైలజ, భర్త.అనిల్ కుమార్, ఫతేఖాన్ పేట, నెల్లూరు. వారి నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకున్నారు. సదరు శైలజ ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **శ్రీ గుండ్లపల్లి కామేశ్వరరావు, తండ్రి.తల్పసాయి,** పప్పుల వీధి, నెల్లూరు గారి నుండి రిజిస్టర్ విక్రయపత్రం తేది.02.12.1998 డాక్యుమెంట్ నెంబర్.7934/98 ద్వారా కొనుగోలు చేసినారని సదరు కామేశ్వరరావు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మరి కొంత ఆస్తిని బుండి దొరస్వామి గారి నుండి రిజిస్టర్ విక్రయపత్రం తేది.09.10.1996 డాక్యుమెంట్ నెంబర్.7573/96 ద్వారా కొనుగోలు చేసినారని మరియు ఈ షెడ్యూల్ దాఖలా ఆస్తిపై సదరు శైలజ గారికి పూర్తి హక్కులు కలవని మరియు ఈ షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎటువంటి పరాధీనములు, అనుమానములు, వ్యవహారములు, క్లైములు, లీజులు, జప్తులు, అగ్రిమెంట్‌లు లేవని చెప్పుచున్నారు. కావున ఈ షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఎవరికేని ఎటువంటి ఆక్షేపనలు ఉన్న ఈ పత్రికా ప్రకటన తేది దినం నుండి 10రోజుల లోగా ఈ క్రింది అడ్రస్‌కు లిఖిత పూర్వకంగా సరిఅగు ఆధారములతో తెలుపుకొనవలసినది. తదుపరి ఆక్షేపణలు నా క్లైంట్‌ను బద్ధగించవు.

షెడ్యూలు

నెల్లూరు రి.డి.యిలాకా నెల్లూరు స.రి.లో చేరిన గుండ్లపాళెం గ్రామ పంచాయతీలో చేరిన గుండ్లపాళెం గ్రామంలోని S.No: 1/1 రు యి 2.01 ట్లు S.No: 1/2 రు యిం.92 ట్లు S.No: 2/2 రు యిం 78 ట్లు S.No: 9/1రు యి1.20ట్లు వెరశి యి 4.91 ట్లు భూమిని యిండ్లు నివేశన స్థలములకు గాను లేఫుట్ చేయబడిన ప్లాను దాఖలా ప్లాట్లలో నెం.1 రు ప్లాటు33 అంకణములా 24 చ.అ నెం.2 ప్లాటు 33 అంకణముల 24 చ.అ.లు వెరశి 66అ.లా 48 చ.అ.లు లేక 445.938 చ.మీ స్థలమునకు హద్దులు.

తూర్పు : నెం : 3రు ప్లాటు, దక్షిణం : నెం : 27 & 28 ర్లు ప్లాట్లు, పడమర : లేఫుట్ రోడ్, ఉత్తరము : లేఫుట్ రోడ్ ఈ హద్దులలోని 66 అంకణములా 48చ.అ.లు స్థలమున్నూ యిందుకు సంబంధించిన మామూలు రాకపోకల యావత్తు యీజిమెంటు హక్కులున్నూ యీస్థలం గవర్నమెంటుది కాదు. గవర్నమెంటుకు తనఖాలు లేవు. అండర్ టేకింగ్‌లోని కావు.

పెనుబాక గంగాధర్ రెడ్డి, B.com., B.L., అడ్వకేటు
రమేష్‌రెడ్డి నగర్, నెల్లూరు. 9849349333